వంగవీటి మోహనరంగా సేవలు ఎనలేనివి


మోహన రంగా జయంతి కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు, యువకులు

వనస్థలిపురం: వంగవీటి మోహన రంగా చేసిన సేవలు ఎనలేనివని, ఆయన స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. కాపు యువత ఆధ్వర్యంలో గురువారం వనస్థలిపురంలోని కాపు సంఘ భవనంలో వంగవీటి మోహన రంగా 77వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాపు కులానికి, సంఘం కోసం సేవలు చేసిన పలువురుని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం పెద్దలు లేళ్ల అంజి ప్రసాద్, పాలంకి సుబ్బరాయన్, ఐఎస్. కోటేశ్వర్ రావు, సంఘం కార్యదర్శి శ్రీనివాస్, యువ నాయకులు కొలిశెట్టి సంజయ్ కుమార్, గంగాధర్, జమదగ్ని, వెంకటనారాయణ, సూరి బాబు, బాబు, అఖిల్, కాపు కుటుంబసభ్యులు, రంగా అభిమానులు పాల్గొన్నారు.

జోనల్ కమిషనర్‌కు వినతి


జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను జోనల్ కార్యాలయంలో కలసి కార్పొరేటర్ సుజాతనాయక్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాతనాయక్ మాట్లాడుతూ హస్తినాపురం డివిజన్ పరిధిలోని ఆదర్శనగర్‌కాలనీలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతి పత్రంలో కోరినట్లు తెలిపారు. ఈ వినతికి జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ సుజాతనాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌తో పాటు నాయకులు దేరింగుల క్రిష్ణ, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, బాస్కర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యూట్యూబ్ చానల్‌పై కేసు నమోదు

ఎల్‌బీనగర్: ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు తీసుకుని అత్యున్నతమైన సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్న తమ పాఠశాలపై కొందరు తప్పుడు ప్రచారంతో విద్యార్థులను అయోమయానికి గురుచేస్తున్న వారిపై వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని లక్ష్యా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ చైర్మన్ కార్తీక్ పేర్కొన్నారు. తమ ఫిర్యాదు మేరకు తప్పుడు ప్రచారం చేస్తున్న ఓ పత్రికతో పాటు మరో యూ ట్యూబ్ చానల్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. వీరు తమ స్కూల్‌పై దురుద్దేశంతో వారి పేపర్లతో పాటు యూట్యూబ్ చానల్‌లో అసత్య ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అంతే కాకుండా కావాలనే తమవద్ద నుంచి డబ్బులు డిమాండ్ చేశారని తాము ఇవ్వలేకపోవడంతో తమపై తప్పుడు ప్రచారంతో విద్యార్థులను అయోమయానికి గురిచేసే విధంగా ప్రవర్తిస్తున్నారని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నామని తెలిపారు. సదరు వ్యక్తులపై ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారని కార్తీక్ తెలిపారు.

పదవులకు వన్నెతెచ్చిన నాయకుడు కొణిజేటి రోశయ్య


రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాచం సత్యనారాయణ తదితరులు

చైతన్యపురి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నో ఉన్నత పదవులను చేపట్టి వన్నెతెచ్చిన గొప్ప నాయకుడు కొణిజేటి రోశయ్య అని వైశ్య వికాస వేదిక చైర్మన్ డాక్టర్ కాచం సత్యనారాయణ అన్నారు. గురువారం వైశ్య మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా చైతన్యపురి వైశ్య వికాస వేదిక ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కాచం సత్యనారాయణ పాల్గొని రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రిగా, ముఖ్యమంత్రిగా అన్ని పదవులకు తనదైన శైలిలో వన్నె తెచ్చారని కొనియాడారు. అంతేకాక తమిళనాడు గవర్నర్‌గా పనిచేసిన ఆయన ఎంతో హుందాతనంతో ఉండి తమిళ ప్రజల ప్రేమను పొందారని ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, టీపీసీసీ అధికార ప్రతినిధి ముగుళ్ల రాజిరెడ్డి, టీపీసీసీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి కొదుమూరి దయాకర్ రావు, డాక్టర్ యర్రమాద కృష్ణారెడ్డి, కూర రమేష్, గజవెల్లి గురుమూర్తి, కానం ఏకసాయి, ఇరుగు శ్రీధర్, ఏలె మహేష్, నవీన్, శివ, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ వ్యాఖ్యలు సిగ్గుచేటు

చైతన్యపురి: లోక్‌సభలో హిందువులపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపి రాహుల్ విద్వేషపూరితంగా వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం రాహుల్ గాంధీ పార్లమెంట్ సాక్షిగా హిందువులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ గడ్డిఅన్నారం డివిజన్ బీజేపి అధ్యక్షుడు దాసరి జయప్రకాష్ ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్‌లో నిరసన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ లోక్‌సభలో రాహుల్ హిందువులపై అవమానకర వ్యాఖ్యలు చేయటం బాధాకరమన్నారు. రాహుల్‌గాంధీ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపి సీనియర్ నాయకులు ఆనంద్‌కుమార్, లక్ష్మీదేవి, మురళి, సుబ్బారెడ్డి, వెంకటేష్‌చారి, అనంతాచారి, ఏనుగు శ్రీధర్‌రెడ్డి, షేక్ ఉమర్, భీష్మాచారి, చిలుకూరు మధుసూదన్, సునీల్, వెంకట్‌రెడ్డి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

అబ్దుల్లాపూర్‌మెట్: ఒడిశా నుంచి నగరానికి గంజాయిని తరలిస్తున్న ఓ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి సుమారు 27 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురిని అదుపులోకి తీసుకున్న సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గురువారం మధ్యాహ్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓఆర్ఆర్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ కారులో కొంతమంది అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో పోలీసులు కారు లోపలి భాగంలో సోదాలు చేయగా 36 ప్యాకెట్లతో ఉన్న సుమారు 27 కిలోల గంజాయి బయటపడింది. కారులో ఉన్న వారిని విచారించగా ఒడిశా రాష్ట్రం నుంచి నగరానికి సరఫరా చేస్తున్నట్లు అంగీకరించడంతో బలరాం తాళి(23), రాజు కపస్య(20), విజయ హాల్దార్(22)లతోపాటు కారు యజమాని కొడుకు మైనర్(13)ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు తప్పని

కాంటా తిప్పలు!

మలక్‌పేట మార్కెట్‌లో ఉదయం పూట పనిచేయని కాంటా

- ఉత్పత్తులు తూకం వేసేందుకు రైతులకు ఇబ్బందులు
- ప్రైవేట్ కాంటాలను ఆశ్రయించాల్సిన దుస్థితి


మార్కెట్‌లో నిరుపయోగంగా మారిన కాంటా

చాదర్‌ఘాట్: ఎండనకా వాననకా ఆరుగాలము శ్రమించి పండించిన ఉత్పత్తులను అమ్ముకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నగరంలోనే అతిపెద్ద మార్కెట్‌లలో ఒకటిగా పేరొందిన మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో రైతులు తాము తెచ్చిన ఉత్పత్తులను తూకం వేసే అధికారిక కాంటా లేక అవస్థలు పడుతున్నారు. రాష్ట్రం నుంచి వివిధ జిల్లాల నుంచే కాకుండా ఆంధ్రా, కర్నాటక, మహారాష్ట్ర తదితర పొరుగు రాష్ట్రాల నుంచి కూడా రైతులు తమ ఉత్పత్తులను అమ్మకానికి ఇక్కడికి తెస్తారు. అయితే గతంలో మార్కెట్ ప్రవేశ ద్వారము వద్దనే కాంటా ఉండేది. రైతులు తమ దిగుబడులను అక్కడ తూకం వేయించుకొని అమ్మకానికి లోపలికి తరలించేవారు. ప్రస్తుత పరిస్థితులు ఇందుకు భిన్నంగా మారాయి. ఇక్కడ కాంటా తొలగించడంతో రైతులు ప్రైవేట్ కాంటాల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

1999లో మొదటిసారి మార్కెట్ ప్రవేశ ద్వారం వద్ద కాంటా ఏర్పాటు చేశారు. కాంట్రాక్టర్ నిబంధనలు మీరడంతో అతని కాంట్రాక్ట్ రద్దు చేశారు. 2017లో మొదటిసారి ఏర్పాటు చేసిన కాంటా మూతపడింది. రెండేళ్ల క్రితం రెండోసారి టెండర్లు ఖరారు చేశారు. అయితే రెండోసారి కాంట్రాక్ట్ దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు సరైన స్థలము కేటాయించడంలో అధికారులు విఫలమయ్యారు. మార్కెట్ మధ్యలో దుకాణాల సముదాయాల వద్ద రెండోసారి ఏర్పాటు చేయడంతో ఉదయం 10 గంటల తరువాత అక్కడికి వాహనాలు చేరుకునే పరిస్థితులు లేవు. దీంతో మూడు నెలలకే కాంట్రాక్టర్ కాంటా మూసివేశారు. సంవత్సర క్రితం రూ. 14 లక్షలతో మరో చోట మూడోసారి కాంటాను ఏర్పాటు చేశారు. అయితే సదరు కాంట్రాక్టర్ ఉదయం వ్యాపారం సాఫీగా సాగటం లేదనే సాకుతో ఆ కాంటాను కేవలం రాత్రి పూటనే తెరిచి ఉంచుతున్నాడు. దీంతో ఉదయం అది నిరుపయోగంగా మారింది. దీంతో రైతుల కష్టాలు మళ్లీ మొదటికొచ్చాయి. ఇప్పటికైనా మార్కెట్‌లో అనువైన స్థలంలో కాంటాను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

గొప్ప యోధుడు 'అల్లూరి'



దిల్‌సుఖ్‌నగర్: పోరాట పటిమతో తెల్లదొరలను వణికించి ప్రాణాలు సైతం తృణపాయంగా అర్పించిన గొప్ప నాయకుడు అల్లూరి సీతారామరాజు అని ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షులు, చిత్రలేవుట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పెండ్యాల నగేష్ అన్నారు. గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి పలువురు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్రాసు అటవీ చట్టానికి ప్రతి స్పందనగా బ్రిటీష్‌వారిని వ్యతిరేకించడంలో పాల్గొన్నారని అన్నారు. అల్లూరి క్షత్రియ సేవా సంస్థ నిర్వాహకులు ఎన్టీఆర్‌నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పెన్నులు, పరీక్ష ప్యాడ్లు, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు సూర్యనారాయణ రాజు, కృష్ణం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

సీసీ రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట: ఎల్‌బినగర్ నియోజకవర్గ పరిధిలో నెలకొన్న మౌలిక సమస్యలన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో దశలవారీగా పరిష్కరించి ఇతర నియోజకవర్గాలకు ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఎల్‌బినగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం చంపాపేట డివిజన్ పరిధిలోని మాధవనగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో రూ. 93 లక్షలతో కర్మన్‌ఘాట్ పాత గ్రామం పరిధిలోని పలు కాలనీలలో సీసీ రోడ్ల పనులు కూడా ప్రారంభించటం జరుగుతుందని స్పష్టం చేశారు. యుద్ధ ప్రాదిపదికన ప్రత్యేక నిధులతో పెండింగ్ పనులు కూడా పూర్తి చేయటం జరుగుతుందని అన్నారు. కాలనీలలో అభివృద్ధి పనులు జరుగుతున్న సమయంలో కొంత మేర అసౌకర్యం తప్పదని కాలనీవాసులు అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముడుపు రాజిరెడ్డి, సుంకోజు కృష్ణమాచారి, అంజిరెడ్డి, ఉమామహేశ్వర్, సదానంద్, రవి ముదిరాజ్, హన్మంత్, బెనర్జీ, సత్తయ్య, శుభర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి


ఎన్నికైన విద్యార్థులతో డైరెక్టర్ సుబ్బారెడ్డి తదితరులు

హయత్‌నగర్: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని, ప్రతీ విద్యార్థి చట్టాలు, ప్రాథమిక హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలని హయత్‌నగర్‌లోని మెగాసిటీ పాఠశాల డైరెక్టర్ సుబ్బారెడ్డి అన్నారు. గురువారం పాఠశాలలో విద్యార్థి నాయకుల ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ లాంటి దేశంలో ఎన్నికల ప్రక్రియ ఎలా జరుగుతుందో విద్యార్థులు తెలుసుకోవాలని, వీరు ఉద్యోగాల కోసమే కాకుండా నాయకులుగా ఎదిగేందుకు ఆలోచించే విధంగా తగిన శిక్షణను ఇస్తున్నామన్నారు. భవిష్యత్తులో దేశాన్ని పాలించే బాధ్యత విద్యార్థులపైనే ఉందని, విద్యార్థులు ఉత్తమమైన నాయకులుగా ఎదగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ డైరెక్టర్ స్వాతి, ప్రిన్సిపాల్ వాసు, వైస్ ప్రిన్సిపాల్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

18 క్వింటాళ్ల రేషన్ సరుకుల పట్టివేత

చంచల్‌గూడ: నగరవ్యాప్తంగా సివిల్ సప్లై శాఖ దాడులు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగానే బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్న రేషన్ బియ్యం, గోధుమలు స్వాధీనం చేసుకున్నారు. చావణీలో పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వ చేసినట్లు సమాచారం అందుకున్న మలక్‌పేట సివిల్ సప్లై శాఖ డిప్యూటీ తహశీల్దార్ ఎన్. కవిత దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో 15.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 2.80 క్వింటాళ్ల గోధుమలను స్వాధీనం చేసుకున్నారు. మహ్మద్ ఇమ్రాన్ చావణీలో అక్రమంగా నిల్వ చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నాడు. దాడుల్లో ఇమ్రాన్ పరారీలో ఉండగా బిహార్‌కు చెందిన కూలీ రాజేష్‌కుమార్ యాదవ్ (26)ను అదుపులోకి తీసుకుని మాదన్నపేట పోలీసులకు అప్పజెప్పారు. నిందితుడిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని అధికారులు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా గోదాం యజమాని మహ్మద్ ఇమ్రాన్ మాత్రం దాడులు జరిగిన ప్రతిసారి తప్పించుకుంటున్నాడు. ఇప్పటికే అతనిపై మాదన్నపేట పీఎస్‌లో పలు కేసులు నమోదయ్యాయి.

దర్యాప్తు లోపం.. కేసు మూసివేత

చంచల్‌గూడ: కేసుల దర్యాప్తు పట్ల పోలీసుల నిర్లక్ష్యం అక్రమార్కులకు వరంగా మారుతోంది. బాధితుల ఇచ్చిన ఫిర్యాదులపై సరైన విచారణ చేయకుండా నిందితులు ఇచ్చిన సమాచారాన్ని ఎలాంటి ఆధారాలు లేకుండా విశ్వసించి కేసును మూసివేశారు. మాదన్నపేట కూరగాయల మండీలో కిరాయిదారులు మడిగల వెనుక భాగం కూల్చివేసి అక్రమంగా షెటర్లు నిర్మించారు. దీంతో అనుమతి లేకుండా చట్టవిరుద్ధంగా తమ ఆస్తి ధ్వంసం చేశారని భూ యాజమాన్యం సభ్యురాలు డి. అండాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన ఎస్ఐ శోభ మాత్రం కిరాయిదారులు మరమ్మతుల కోసం అనుమతి కోరుతూ భూ యాజమాన్యానికి ఇచ్చిన లేఖ ఆధారంగా కేసును మూసివేసినట్లు తెలిపింది. అసలు యాజమాన్య కమిటీ లిఖితపూర్వకంగా అనుమతులు ఇచ్చిందా లేదా అనే కోణంలో విచారణ జరగలేదు. కాగా కిరాయిదారులకు ఆస్తి ధ్వంసం చేయడానికి, అక్రమ నిర్మాణాలకు సంబంధించి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని భూ యాజమాన్య సభ్యురాలు డి. అండాలు తెలిపారు. దర్యాప్తు పూర్తి కాకుండా కేసును మూసివేయడం ఆశ్చర్యానికి గురి చేసుంది.

టన్నెల్ పనులు త్వరగా పూర్తి చేయాలి

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్ సరూర్‌నగర్ చెరువు నుంచి కోదండరాంనగర్ కాలనీ వరకు జరుగుతున్న టన్నెల్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ ఈస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ సుజాత ఇతర అధికారులతో కలసి డివిజన్‌లోని పలు కాలనీలలో ఆయన పర్యటించారు. ముఖ్యంగా ముంపు సమస్యను, పబ్లిక్ రోడ్ల ఆక్రమణలు, పలు సమస్యలను కార్పొరేటర్ జోనల్ కమిషనర్‌కు వివరించారు. కోదండరాంనగర్, వీవీనగర్ బస్ స్టాప్, కమలానగర్, లలితానగర్, మధురాపురి కాలనీలో పబ్లిక్ రోడ్ల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టిపెడతామన్నారు. కమలానగర్ నుంచి వైభవ్ టిఫిన్ సెంటర్ వరకు స్టామ్ వాటర్ నాలా పునరుద్ధరణ పనులు వెంటనే చేపట్టాలని కార్పొరేటర్ కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసి ఏఇ శ్రీనివాస్, స్ట్రీట్ లైట్స్ డీఇ పున్ననాయక్, శానిటేషన్ ఇఇ నీలిమ, డీఇ విజయ్, ఏఇ రూప, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్, ఎంటమాలజీ, శానిటేషన్ సిబ్బంది, స్థానికులు దాసరి జయప్రకాష్, ఏనుగు శ్రీధర్‌రెడ్డి, టింకు, రఘునందన్ జోషి గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి కుండలలో బోనం సమర్పణ తెలంగాణ సంప్రదాయం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జయంత్‌రావు, దయానంద్

చంపాపేట: తెలంగాణా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలిచే బోనాల పండుగలో అమ్మవారికి సమర్పించే నైవేద్యాలకు మట్టి కుండలనే ఉపయోగించటం అనాదిగా వస్తున్న సంప్రదాయమని రాష్ట్ర కుమ్మరి సంఘ అధ్యక్షుడు నడికుడి జయంత్‌రావు అన్నారు. గురువారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ అనంద్ ఫంక్షన్‌హాల్‌లో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి దయానంద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఈనెల ఏడున లోయర్ ట్యాంక్ బండ్ ప్రాంతంలోని శ్రీకనకాల కట్టమైసమ్మ అమ్మవారికి కుమ్మర్లచే 501 మట్టి కుండలతో తొలి బోనం కార్యక్రమ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జయంత్‌రావు మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రంలో బోనాల పర్వదినానికి ఎంతో విశిష్టత ఉందని అమ్మవారికి ఎంతో ప్రీతికరమైన మట్టి కుండలలో నైవేద్యాన్ని వండి దానిని కుమ్మరుల చేతి మీదుగా అమ్మవారికి సమర్పించటం అనాదిగా వస్తున్న సంప్రదాయమని గుర్తు చేశారు. నిత్యం మన ఇండ్లలో అనారోగ్యాన్ని పంచిపెట్టే ప్లాస్టిక్, మెటల్ పాత్రల స్థానంలో మట్టి పాత్రలనే ఉయోగించే విధంగా ప్రచారం చేయాల్సిన బాధ్యత మన కుమ్మరులపై ఉందని అన్నారు. దయానంద్ మాట్లాడుతూ మారుతున్న కాలాలకు అనుగుణంగా కుమ్మరి చేతివృత్తిదాలు మట్టి పాత్రల తయారీలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన్ని ఉపయోగించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. మట్టి పాత్రల వినియోగం వల్ల పర్యావరణ పరిరక్షణ సాధ్యమై మానవ మనుగడకు ఎటువంటి ఢోకా ఉండదని అన్నారు. ఈ నెల ఏడున లోయర్ ట్యాంక్ బండ్ శ్రీ కనకాల కట్టమైసమ్మ తొలి బోనాల జాతరకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి పెద్ద ఎత్తున కుమ్మర్లు హాజరవుతారని జాతరను దిగ్విజయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బోనాల ఉత్సవ కమిటీ కన్వీనర్ ఎగిరిశెట్టి వీరయ్య, మహిళా కన్వీనర్ లక్ష్మీ, సంఘ ఉపాధ్యక్షుడు వీరేశం, కోశాధికారి రాజలింగము, కార్యదర్శి శంకర్, సభ్యులు చంద్రయ్య, ప్రభాకర్, రవీందర్, అజయ్‌కుమార్, అశోక్, యాదయ్య, నాగరాజు, సుభాష్, జంగం తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో భక్తులకు మెరుగైన సౌకర్యాలు


నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న రఘుమారెడ్డితో పాలక మండలి సభ్యులు

చంపాపేట: దాతల సహాయ, సహకారాలతో కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ స్వామివారి ఆలయంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించటం జరుగుతుందని ఆలయ పాలక మండలి చైర్మన్ నల్లా రఘుమారెడ్డి అన్నారు. గురువారం దాత జాలా యాదగిరిరెడ్డి తన సొంత ఖర్చుతో దుర్గామాత ఆలయం నుంచి సంతోషీమాత ఆలయం వరకు ఏర్పాటు చేయనున్న రేకుల షెడ్డు పనులకు ఆయన హాజరై ఆలయ ఈఓ శ్రీనివాసశర్మ, పాలక మండలి సభ్యులతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఆనంద్‌గౌడ్, యాదగిరి, కళ్యాణ్, తిరుమలేష్, కళ్యాణ చక్రవర్తి, అంజిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సురేష్‌గౌడ్, యాదగిరి, సతీష్‌గౌడ్, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి

అధికారులకు జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్ ఆదేశాలు


సమస్యలు తెలుసుకుంటున్న జోనల్ కమిషనర్

నాగోలు: కొత్తపేట డివిజన్‌లోని బాక్స్ డ్రైనేజీ పనులు రీ టెండర్ పెట్టి పనులు పూర్తి చేయాలని అధికారులను జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్ ఆదేశించారు. గురువారం కొత్తపేట డివిజన్‌లో జీహెచ్ఎంసీ అధికారులు, కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్‌తో కలసి వివిధ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కొత్తపేట డివిజన్‌లో పెండింగ్‌లోని బాక్స్ డ్రైనేజీ పనులు త్వరగా పూర్తి చేస్తామని, పూర్తయిన చోట నూతన సీసీ రోడ్లను కూడా ఏర్పాటు చేస్తామని జోనల్ కమిషనర్ తెలిపారు. కొత్తపేట డివిజన్లోని సమస్యలపై కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. గాయత్రిపురం కాలనీ, నాగేశ్వర్‌నగర్ కాలనీ, శ్రీ రామలింగేశ్వర కాలనీ, బృందావన్ కాలనీ మీదుగా మూసీ నదికి వర్షపు నీరు ప్రవహించటానికి బాక్స్ డ్రైనేజీ లైన్ గత సంవత్సరంలో ప్రారంభించి పనులు అర్థాంతరంగా అసంపూర్తిగా ఆపివేయడం జరిగిందని తెలిపారు. దిగువన దాదాపు 9 కాలనీలకు వెళ్లడానికి ఇదే ప్రధాన మార్గం కావడంతో కాలనీవాసులకు ఎంతో ఇబ్బందికరంగా మారుతుందని తెలిపారు, ప్రైవేట్ పాఠశాలలు కూడా ఉండటంతో పాఠశాల విద్యార్థులకు కూడా ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. వెంటనే బాక్స్ డ్రైనేజీ పనులు పూర్తయ్యేలా చూడాలని డ్రైనేజీ పనులు పూర్తయిన చోట నూతన సీసీ రోడ్లను ఏర్పాటు చేయాలని కమిషనర్ కోరారు. అదే విధంగా తెలంగాణ పార్క్ అభివృద్ధి పనులను కమిషనర్ పరిశీలించి పార్కు అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుజాత, వివిధ శాఖల అధికారులు, నాగేశ్వర్ కాలనీ అధ్యక్షుడు రాంనాథ్ రెడ్డి, గాయత్రిపురం కాలనీ అధ్యక్షుడు, కెవిఆర్ చారి, విజయ్ భాస్కర్, సత్యనారాయణ, నాయకులు మంచి రాజేష్, నారాయణ, రాకేష్ యాదవ్, లక్ష్మి రాజు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద



సైదాబాద్: నేటి తరం యువతకు స్వామి వివేకానంద స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తారని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి అన్నారు. గురువారం వివేకానందుడి 122వ వర్ధంతిని పురస్కరించుకొని ప్రెస్‌కాలనీలోని ఆయన విగ్రహానికి కార్పొరేటర్ బీజేపీ నాయకులతో కలసి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆశయ సాధనకు కృషి...

వివేకానందుడి ఆశయ సాధనకు కృషి చేస్తామని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం సైదాబాద్ డివిజన్ ఎల్ఐసీ కాలనీలోని వివేకానందుడి విగ్రహానికి ఆమె కాలనీవాసులతో కలిసి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ అవసరం


మాట్లాడుతున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి

మలక్‌పేట: వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. కృష్ణతులసినగర్ కమ్యూనిటీ హాల్లో గురువారం శానిటేషన్ అధికారులు, ఎస్ఎఫ్ఏలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని పారిశుద్ధ్యంపై అధికారులతో చర్చించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ బోనాల పండుగను పురస్కరించుకుని దేవాలయాల పరిసర ప్రాంతాలు పరిశుభ్రం చేయాలని, భక్తులకు ఏలాంటి అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. కాలనీలలో పేరుకుపోకుండా చెత్తను క్రమంగా తరలించడానికి డంపింగ్ వెహికల్స్ అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదు వస్తే వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. సమావేశంలో డీఈ వెంకటపతి రాజు, శానిటేషన్ సూపర్‌వైజర్ గోవిందరెడ్డి, జవాన్ రమేష్, ఎస్ఎఫ్ఏలు, శ్రీనివాస్, ముజీబ్, సుభాష్, గణేష్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో చోరీ

నాగోలు: సాయిబాబా దేవాలయంలో ఓ వ్యక్తి భక్తుడిగా వచ్చి దేవాలయంలోని వెండి ఆభరణాలు చోరీ చేసిన సంఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. నాగోలు జైపురికాలనీలోని సాయిబాబా దేవాలయంలో గురువారం కావడంతో దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అందరూ వెళ్లిపోయిన తరువాత ఓ వ్యక్తి భక్తుడిగా ఆలయం లోపలికి ప్రవేశించి బాబా విగ్రహాన్ని దర్శించుకుని అక్కడే ఉన్న దాదాపు 40 వేల విలువైన వెండి దీపాలు, ఇతర వెండి వస్తువులు తీసుకుని వెళ్లిపోయాడు. ఆ తరువాత సీసీ కెమెరాలను పరిశీలించిన కమిటీ సభ్యులు దొంగతనం జరిగిన విషయాన్ని గుర్తించారు. వెంటనే దేవాలయ కమిటీ చైర్మన్ కొలను వెంకట్‌రెడ్డి, కార్యదర్శి గుండ సోమయ్య, కోశాధికారి రావుల రంజిత్‌గౌడ్ నాగోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.